# తెలంగాణ శాసనమండలి – 2025 ఉమ్మడి సమావేశాన్ని పురస్కరించుకొని గౌరవనీయులైన <u>గవర్నర్ గారి ప్రసంగం</u>

**గౌరవనీయులైన శాసన పరిషత్తు చైర్మెన్ గారు,**

**గౌరవనీయులైన శాసన సభ స్పీకర్ గారు,**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు,**

**గౌరవనీయులైన మంత్రిమండలి సభ్యులకు; శాసన పరిషత్తు, శాసన సభ గౌరవ సభ్యులకు మరియు శ్రమించే తత్వంగల, శాంతికాముకులైన నా తెలంగాణ ప్రజలకు,**

1. ఈ రోజు నేను అత్యంత గౌరవంతో, స్థిరమైన నిబద్ధతతో ఈ ప్రతిష్టాత్మక సభా సమక్షంలో నిలబడి వున్నాను. తెలంగాణలోని ప్రతి పౌరునికి కలలుగని, అభివృద్ధి చెంది, వర్ధిల్లే విధంగా అవకాశాలను చేకూర్చాలనే నిబద్ధతకు - ఈ బడ్జెట్ సమావేశం అద్దం పట్టేదిగా, పునరుద్ఘాటించేదిగా, కట్టుబడి ఉండటానికి ప్రతిరూపంగా ఉంది.

2. తెలంగాణ కేవలం పురోగమించడమే కాకుండా రూపాంతరం చెందుతున్నది. సమ్మిళితత్వం, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ

అనే విజన్ సాహసోపేత సంస్కరణలు, ప్రజా కేంద్రీకృత సుపరిపాలన, నిర్ణయాత్మక నాయకత్వంతో సాకారమవుతున్నది.

3. "నిన్ను నువ్వు కనుగొనడానికి అత్యుత్తమ మార్గం ఇతరుల సేవలలో నిమగ్నమవ్వడమే" అనే మహాత్మా గాంధీ గారి ఈ మాటలు, పాలన కేవలం పరిపాలన మాత్రమే కాదని - ఇది ప్రజలకు సేవలను అందించడం, జీవితాలను మార్చడం, అందరికి గౌరవప్రదమైన, సమృద్ధి కలిగిన, న్యాయబద్ధమైన భవిష్యత్తును ఇవ్వాలని గుర్తు చేస్తాయి.

4. రైతులు, యువత, మహిళలు, కార్మికులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు విధానాల రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో ప్రతిబింబించేలా అభివృద్ధి దిశగా నా ప్రభుత్వం స్థిరమైన మార్గాన్ని నిర్ధారించింది. ఈ బడ్జెట్ సమావేశంలో కూడా నా ప్రభుత్వం స్థిరమైన వృద్ధి కోసం పునాదులను, సామాజిక న్యాయం అనే పిల్లర్లను పటిష్టపరచి పరిమితిలేని అవకాశాలు గల భవిష్యత్తు దిశగా తెలంగాణ తన ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది. సమ్మిళిత అభివృద్ధి, వినూత్నత, స్థిరమైన పురోగతి తెలంగాణలో ఉండాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది, సాంకేతిక విజ్ఞాన అభివృద్ధిని జోడిస్తూ, సామాజిక సంక్షేమ పథకాలను పటిష్టపరుస్తూ, అందరికి ఆర్థికపరమైన అవకాశాలను పెంపొందించుతూ నా రాష్ట్రంలోని ప్రతి పౌరునికి సమృద్ధి, సమానత ఉండేలా భవిష్యత్తును

రూపొందించడానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది. ఆ విధంగా ముందుకు వెళ్తూ అభివృద్ధి, సాంకేతిక విజ్ఞాన అభివృద్ధి, న్యాయబద్ధ పురోగతి పొందడమే తెలంగాణ విజన్‌గా ఉంది – అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిలా ఉండే ఒక మోడల్ రాష్ట్రంగా ఉండాలి.

## తెలంగాణ గుర్తింపు, వారసత్వాన్ని గౌరవించడం

5. తెలంగాణ అనేది ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదు – అది ఒక భావోద్వేగం, పోరాటానికి, స్థిరత్వానికి, ధృడ సంకల్పానికి ఒక గుర్తుగా ఉంది. మన సంస్కృతి చరిత్ర, సాంప్రదాయాలలో పాతుకుపోయినప్పటికీ మన విజన్ ముందుచూపుతో పురోగమిస్తున్నది.

6. తెలంగాణకు చెందిన గొప్ప వ్యక్తులను గుర్తిస్తూ ప్రభుత్వం సాహిత్య, సాంస్కృతిక ఉద్ధండులైన గద్దర్, గూడ అంజయ్య, బండి యాదగిరి, ఇతరులను గౌరవించాలని యోచిస్తున్నది. ఇది వారి ప్రతిభకు గుర్తింపుతో పాటుగా మన ప్రజల ఆకాంక్షలను చాటి చెప్పిన వ్యక్తులకు ఒక నివాళి.

7. రాష్ట్ర గేయంగా “జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం” అధికారిక స్వీకరణ తెలంగాణ యొక్క పూర్వ, ప్రస్తుత, భవిష్యత్తు కాలాలకు వేడుకగా ఉంది. తెలంగాణ గేయం రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన పోరాటాలు, త్యాగాలను గౌరవించడం మాత్రమే కాకుండా భవిష్యత్తు కోసం

ఆశను, స్ఫూర్తిని కూడా నింపుతుంది. ప్రగతిశీలక, సమృద్ధి కలిగిన, సమ్మిళిత తెలంగాణను ఉద్దేశించిన ఈ గేయం ఉజ్వలమైన భవిష్యత్తును కలుగచేయడంలో ప్రతి పౌరుని పాత్రను గుర్తు చేస్తుంది. ఈ గేయం ఐక్యమత్యానికి, స్థిరత్వానికి, సమిష్టి అభివృద్ధికి పిలుపుగా, ప్రజలలో భావోద్వేగ, సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేస్తున్నది.

8. తెలంగాణ తల్లి విగ్రహ అధికారిక స్వీకరణ రాష్ట్ర విశిష్ట గుర్తింపును, సమ్మిళిత స్ఫూర్తిని మరింత పటిష్టపరుస్తుంది. సాంప్రదాయక విగ్రహాల మాదిరిగా కాకుండా, ఈ విగ్రహం, కులం, వర్గం, ప్రాంతీయ భావాలకు అతీతంగా తెలంగాణకు చెందిన ప్రతి వ్యక్తి ప్రతిబింబంగా ఉంది. ఇది ఆత్మగౌరవం, సాధికారతకు చిహ్నంగా, క్రియాశీలకంగా పురోగమించే సమాజపు ఆకాంక్షకు ప్రతీకగా ఉంది. తెలంగాణ దిశగా సాగిన ప్రయాణం, సాధించిన విజయాలు, భవిష్యత్తుకోసం పరిమితి లేని సామర్థ్యానికి సాక్ష్యంగా మన ప్రజల హృదయాలలో నిలుస్తుంది.

9. ఈ చర్యలు తెలంగాణ సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందింపజేసి, పురోగతితో పాటుగా మన సంప్రదాయాలతో గాఢమైన సంబంధాన్ని ఏర్పరచుతాయి. ఈ సాంస్కృతిక ఉజ్జీవం మన గుర్తింపును పటిష్టపరచడంతో పాటుగా సంఘటిత వృద్ధి, సామరస్య స్ఫూర్తితో మన ప్రజలను ఏకం చేస్తుంది.

## వ్యవసాయం : తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పునాది

10. తెలంగాణ రైతులు ఈ రాష్ట్రానికి ప్రాణం లాంటివారు. వారి స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తుంది. మన ఆర్థిక వ్యవస్థను స్థిరపరుస్తుంది, మన సాంప్రదాయాలను నిలబెట్టుతుంది. వారిని ప్రోత్సహించి, ఉద్ధరించి, సాధికారతను కల్పించడమే ప్రభుత్వ నైతిక కర్తవ్యంగా ఉంది.

11. 260 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రికార్డుతో దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తిదారుగా తెలంగాణ ఆవిర్భవించింది. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఒక సాక్ష్యం. వారితో ఈ ప్రభుత్వం భుజం కలిపి సగర్వంగా నిలబడుతుంది.

12. ఆర్థిక భద్రత ఉండేలా చూడటానికి, రూ.20,616.89 కోట్ల మొత్తంతో 25.35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తూ నా ప్రభుత్వం రూ.2 లక్షల పంట రుణ మాఫీని అమలు చేసింది. ఇది సహాయం మాత్రమే కాదు, ఇది నా ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్టకాల అమలుకు సాక్ష్యంగా ఉంది.

13. అంతేకాక, అధునాతన పద్ధతులు, మెరుగైన సాగు, మేలు రకం విత్తనాల కోసం పెట్టుబడి పెట్టడానికి రైతులకు వీలు కల్పిస్తూ రైతు భరోసా పథకం క్రింద నేరుగా ఆర్థిక సహాయాన్ని ఏడాదికి ఎకరాకు రూ.12,000/-లకు పెంచడమయింది.

14. ప్రభుత్వం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద పొలాలలో అలుపు లేకుండా పనిచేస్తున్న భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు ఇదివరకు ఎన్నడూ లేని విధంగా సహాయం చేస్తూ ఏడాదికి రూ.12,000/-లను సమకూరుస్తున్నది.

15. అత్యాధునిక ఆడియో-విజువల్ మీడియాను సమకూరుస్తూ మొత్తం 566 రైతు వేదికలను ఏర్పాటు చేయడం జరిగింది. రైతు నేస్తం కార్యక్రమాన్ని అన్ని 532 గ్రామీణ మండలాలలో అమలుచేస్తూ, వ్యవస్థీకృత వీడియో కాన్ఫరెన్సింగులో పాల్గొనడానికి రైతులకు, సైంటిస్టులకు, అడ్మినిస్ట్రేటర్లకు క్రియాశీలకమైన వేదికను సమకూర్చింది. ఈ ప్రోత్సాహక సదుపాయాలు అవరోధాలు లేని పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి, సహకారాన్ని పెంపొందించడానికి దోహదపడి, వ్యవసాయ పురోగతికి, గ్రామీణ సాధికారతకు గణనీయంగా తోడ్పడుతాయి.

16. మన ప్రజానీకం వినియోగించే వివిధ రకాల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసే రైతులకు న్యాయోచితమైన ధరను, ఆదాయ భద్రతను కల్పించేందుకు రైతులు పండించే సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500/-ల బోనస్ చొప్పున మొత్తం రూ. 1,206.44 కోట్లను విడుదల చేసింది.

17. వ్యవసాయ రంగాన్ని పటిష్టపరచడంలో ఒక ప్రధాన చర్యగా నా ప్రభుత్వం తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ రైతు సమస్యలను పరిష్కరించి, స్థిరమైన పాలసీలను రూపొందించి, తెలంగాణ వ్యవసాయ రంగం స్థితిస్థాపకంగాను, భవిష్యత్తుకు సిద్ధంగా వుండేలా చేసేందుకు ఒక ప్రత్యేక సంస్థగా పనిచేస్తుంది. శాస్త్రీయ పరిశోధన, నూతన సాంకేతికత, రైతు కేంద్రీకృత కార్యక్రమాలను సమ్మిళిత పరచడం ద్వారా, మన రైతులు దీర్ఘకాలిక శ్రేయస్సు పొందడంలో ఒక కీలకపాత్రను పోషిస్తుంది.

18. నిరంతర, వ్యూహాత్మక ప్రయత్నాల ద్వారా, నా ప్రభుత్వం కృష్ణానదీ జలాలలో తెలంగాణ యొక్క న్యాయబద్ధమైన వాటాను పరిరక్షించుకోవడానికి కృష్ణా జలాల ట్రిబ్యునల్-II సమక్షంలో తన వాదనను వినిపించింది. నా ప్రభుత్వం యొక్క నిర్ణయాత్మక చర్య రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి, భావి తరాలకు నీటి వనరులను భద్రపరచడంలో మా నిబద్ధతను తెలుపుతుంది.

19. సాగునీరు, వైజ్ఞానిక పురోగతులు, మార్కెటు అనుసంధానాలలో గణనీయమైన పెట్టుబడుల ద్వారా వ్యవసాయంపై నా ప్రభుత్వానికి ఉన్న దృఢమైన నిబద్ధతను కొనసాగిస్తూ తెలంగాణ రైతులు మనుగడ సాగించడంతో పాటుగా అభివృద్ధి చెందేటట్లు చూస్తాం.

## మహిళా సాధికారత : తెలంగాణ శక్తి

20. తమ మహిళలకు సాధికారత, రక్షణ, సమాన అవకాశాలు ఇవ్వకుండా ఏ సమాజం కూడా పురోగతిని సాధించలేదు. మహిళలలోని పరివర్తన శక్తిని తెలంగాణ గుర్తించి, అడ్డంకులను తొలగించి, వారికి కొత్త అవకాశాలను కల్పించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

21. మహాలక్ష్మి పథకం గేమ్-ఛేంజర్‌గా వుండి, మహిళలకు 149.63 కోట్ల ఉచిత బస్సు ట్రిప్పులను కల్పిస్తూ, ప్రయాణపు ఖర్చులలో వారికి రూ.5005.95 కోట్లు ఆదా చేసింది. ఈ చర్య వారి గమనశీలతను మాత్రమే కాకుండా స్వేచ్ఛ, గౌరవం, ఆర్థిక సాధికారతను తెలుపుతుంది.

22. ఇటీవలే ఆమోదించిన ఇందిరా మహిళాశక్తి మిషన్ పాలసీ ద్వారా ప్రభుత్వం ఒక లక్ష కోట్ల ఆర్థిక సహాయ లక్ష్యంతో లక్షమంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారుచేస్తున్నది. మహిళలు నడిపిస్తున్న స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జిలు) మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వహణను, స్కూలు యూనిఫాం తయారీని, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను అప్పగించడమయింది.

23. అంతేకాక, 50 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తూ 200 యూనిట్ల వరకు విద్యుత్తును వినియోగిస్తున్న కుటుంబాలకు ఉచిత

విద్యుత్తును అందిస్తూ నా ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నది.

24. అంతేకాక, ప్రభుత్వం 43 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తూ సబ్సిడీపై ఎల్‌పిజి సిలిండరును రూ.500/-లకు అందిస్తున్నది. పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి ఈ పథకం క్రింద రూ. 433.2 కోట్ల సబ్సిడీని ఇచ్చింది.

25. ముఖ్యమైన చర్యగా, ప్రత్యేకించి మహిళలు నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జిలకు 1000 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం కేటాయించి, పునరుత్పాదక ఇంధన రంగంలో వారిని కీలకమైన వ్యక్తులుగా చేసింది.

26. మహిళలు అభివృద్ధిలో లబ్ధిదారులుగా ఉండటం మాత్రమే కాకుండా అభివృద్ధి కారకులుగా కూడా వుంటారు. ప్రతి మహిళకు విద్య, ఉపాధి, ఆర్థిక భద్రత, వ్యక్తిగత స్వేచ్ఛను కల్పిస్తూ తెలంగాణ ఒక ఉదాహరణగా నిలిచింది. మహిళా సాధికారత కోసం నా ప్రభుత్వం యొక్క కృషిని నేను మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నాను.

## యువజన సాధికారత

27. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయడం ద్వారా యువతకు సాధికారతనివ్వాలని నా ప్రభుత్వం నిశ్చయించింది. నూతన

కల్పనలను ప్రోత్సహించడం, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల (ఎటిసి) ద్వారా అగ్రశ్రేణి శిక్షణను ఇస్తూ, ప్రపంచవ్యాప్తంగా పోటీపడే నైపుణ్యాలు గల యువ ప్రతిభావంతులను అందిస్తున్నాం. ఈ చర్య నైపుణ్యం గల సిబ్బందిని తయారు చేయడంలో మా నిబద్ధతను తెలుపుతూ, తద్వారా రాష్ట్ర పురోగతి, ఆదాయాన్ని పెంపొందిస్తున్నది.

28. సివిల్ సర్వీసు పరీక్షల అశావహులకు సహాయం చేసి, వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ చర్య వల్ల ఉన్నత విద్యను అభ్యసించాలనే అర్హులైన అభ్యర్థులకు వారి ఆర్థిక ఇబ్బందులు ఆటంకపరచకుండా చూస్తుంది. ఈ పథకం క్రింద ప్రతి ఒక సివిల్ సర్వీసు ఆశావహుడు రూ. ఒక లక్ష ఆర్థిక సహాయం పొందుతాడు, తద్వారా వారి అభిలాషను నెరవేర్చుకొని, దేశ సుపరిపాలనలో తోడ్పాటునందించడానికి వారికి సాధికారతనిస్తున్నది.

29. యువతకు ఉపాధి అవకాశాలను పునరుద్ధరించడమే తెలంగాణ ప్రభుత్వానికి ముఖ్యమైన ప్రాధాన్యతగా ఉంది. గత సంవత్సరంలో 55,000 మందికి పైగా యువకులు, యువతులు పారదర్శక, మెరిట్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ద్వారా ప్రభుత్వోద్యోగాలు పొందారు. ఇది ఎన్నడూ సాధించని విజయం. నిష్పక్షపాత, సత్వర, సమర్థమైన

రిక్రూట్‌మెంట్ విధానాలతో తమ నిబద్ధతను తెలపడానికి తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమీషన్‌తో నా ప్రభుత్వం కలిసి పనిచేస్తుంది.

30. క్రీడలలో గ్లోబల్ లీడర్‌గా రాష్ట్రానికి హోదా కల్పించడానికి నా ప్రభుత్వం కట్టుబడివుంది. ప్రపంచ స్థాయి అథ్లెట్లను తయారు చేయడానికి గానూ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు బిల్లును ఆమోదించడమయింది. అదనంగా, అన్ని స్థాయిలలో అథ్లెట్లకు సమగ్ర మద్దతును యివ్వడానికి సుస్థిరమైన స్పోర్ట్స్ ఎకోసిస్టంను రూపొందించేందుకు ఒక సమగ్ర స్పోర్ట్స్ పాలసీని ప్రవేశపెట్టడమయింది. రాష్ట్రంలో అట్టడుగు స్థాయి నుండి ప్రతిభను గుర్తించడానికి ప్రభుత్వం 2024 సిఎం కప్ ను విజయవంతంగా నిర్వహించింది. ఈవెంట్లు 36 విభాగాలలో నిర్వహించబడి, 2980 మంది పారా అథ్లెట్లతోపాటు 2.96 లక్షల మంది అథ్లెట్లు పాల్గొనడం జరిగింది. ప్రభుత్వం గత సంవత్సర కాలంలో ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్ బాల్, చెస్‌లలో అనేక జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లను తొలిసారి విజయవంతంగా నిర్వహించింది.

## సాధికారత గల తెలంగాణ కోసం విద్యావ్యవస్థను మార్చడం

31. అణగారిన వర్గాల శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విషయంలో నిబద్ధతతో ఉంది. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు సహాయం

చేయడానికి డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచుతూ, మెనూ ఛార్జీలను గణనీయంగా పెంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, వారి పోషణ మరియు విద్యాపరమైన విజయాలను మెరుగుపరిచి, నిరుపేద యువత నిలదొక్కుకునే వాతావరణాన్ని పెంపొందించడమే ఈ చర్యల ఉద్దేశ్యం.

32. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడమే నా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశంగా వుంది. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్కీమ్ ప్రారంభంతో ఎస్సి, ఎస్టి, బిసీ విద్యార్థులు అత్యంత నాణ్యమైన, పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విద్యను పొందుతారు. అందరికీ సమాన అవకాశాలను కల్పిస్తూ విద్యాపరమైన ప్రతిభ, సమగ్రాభివృద్ధిని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాలు సామాజిక సంక్షేమం మరియు ప్రతి పౌరుడికి ఆర్థిక మద్దతు పట్ల నా ప్రభుత్వం యొక్క స్థిరమైన నిబద్ధతను తెలియజేస్తాయి.

33. మన విద్యా విధానాన్ని మరింత పటిష్టపరచడానికి, నా ప్రభుత్వం తెలంగాణ విద్యా కమీషన్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రమంతటా నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన అవకాశాలను పెంపొందించేలా పాలసీలను రూపొందించడంలో ఈ కమీషన్ దిశా నిర్దేశం చేస్తుంది. ఆవిష్కరణలను పెంపొందించడం, విద్యా వనరులు

సమానంగా అందేటట్లు చూడడం ద్వారా తెలంగాణ విద్యా కమీషన్ భవిష్యత్తు తరాలకు సాధికారికతను కల్పించడంలోను, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడానికి ఒక పరివర్తనాత్మక పాత్రను పోషిస్తుంది.

34. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే దిశగా, నా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ అద్భుతమైన కార్యక్రమం అమలు, పర్యవేక్షణ పాఠశాల మౌలిక సదుపాయాల నిర్వహణలో ఒక కీలక పాత్రను పోషించడానికి మహిళా స్వయం సహాయక గ్రూప్‌ల (ఎస్‌హెచ్‌జిలు) సామర్థ్యాన్ని వినియోగించుకుంటుంది. పాఠశాల సౌకర్యాలను పటిష్టపరచడం, బాలికలకు మరుగుదొడ్లు నిర్మించడం, శుభ్రమైన త్రాగునీటిని సమకూర్చడం, పాఠశాల ఆవరణలో పారిశుధ్యాన్ని నిర్వహించడం కోసం ఈ గ్రూపులు అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయి. అదనంగా, ప్రతి విద్యార్థి గౌరవం, శ్రేయస్సు కోసం మధ్యాహ్న భోజనాలు, యూనిఫాంలతోపాటు కీలకమైన విద్యార్థి ఆవశ్యకతలను అందిస్తున్నది. ఈ కార్యక్రమం కేవలం మౌలిక సదుపాయాలకి సంబంధించినది మాత్రమే కాదు – విద్యా విషయంలో సామాజిక పరివర్తన, మహిళా సాధికారికత, తెలంగాణలోని విద్యార్థులందరికి సురక్షిత, సమగ్ర, సుసంపన్నమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడం.

## ఆరోగ్య తెలంగాణ కోసం ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం

35. నా ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణ అనేది సదుపాయం మాత్రమే కాదని; అది ఒక ప్రాథమిక హక్కు అని విశ్వసిస్తుంది. ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి పౌరుడు నాణ్యమైన వైద్య సంరక్షణను పొందేటట్లు చూడడానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది. ఆరోగ్యశ్రీ పథకం క్రింద కవరేజిని రూ.5 లక్షల నుండి గణనీయంగా పెంచుతూ, ఇప్పుడు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య సంరక్షణను వర్తింపజేస్తూ, తెలంగాణ ప్రజలకు సమగ్ర తృతీయ వైద్య సేవలను అందిస్తున్నది.

36. తీవ్రమైన అనారోగ్యాలు నయం చేయడానికి, శస్త్ర చికిత్సలు, ప్రత్యేక చికిత్సలను అందించడానికి ఆరోగ్యశ్రీ క్రింద కొత్తగా 163 మెడికల్ ప్రొసీజర్లను చేర్చడం ద్వారా ఖరీదైన వైద్య బిల్లుల భారాన్ని ఏ పౌరుడూ మోయాల్సిన అవసరం లేకుండా చూస్తున్నది.

37. ఆధునిక ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలలో పెట్టుబడుల ద్వారా మారుమూల ప్రాంతాలలో ప్రజలకు కూడా ఆసుపత్రులను దగ్గర చేశాయి. ఈ ప్రభుత్వ లక్ష్యం స్పష్టంగా ఉంది, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి ఒక్కరికి సకాలంలో తగిన వైద్యం అందిస్తోంది.

## సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందేలా చూడడం

38. సామాజిక న్యాయం పునరాలోచించే అంశం కాదు, ఇది తెలంగాణ అభివృద్ధి విధానానికి పునాదిగా ఉంది. ప్రతి పౌరునికి అవకాశాలు, సమృద్ధి సమాన స్థాయిలో అందుబాటులో వుండేలా సమ న్యాయం, గౌరవం, సమ్మిళిత సూత్రాలను నా ప్రభుత్వం విశ్వసిస్తుంది.

39. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే నిర్వహించడం ద్వారా నా ప్రభుత్వం సాహసోపేతమైన మార్పు దిశగా ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. అట్టడుగు వర్గాలను పైకి తీసుకురావటానికి వీలుగా పాలసీలను రూపొందించడానికి ఖచ్చితమైన డేటాను పొందడం ద్వారా న్యాయబద్ధ, సమ్మిళిత సమాజాన్ని నిర్మించే దిశగా ఈ సంచలనాత్మకమైన కార్యక్రమం ఒక కీలకమైన చర్యగా వుంది. ఈ విస్తృతమైన డేటా సేకరణ సాక్ష్యం-ఆధారిత పాలసీ రూపకల్పనకు బలమైన పునాదిని ఏర్పాటు చేసి, న్యాయబద్ధత, పారదర్శకత, ఖచ్చితమైన పరిజ్ఞానంతో నిర్వహించే పాలన విషయంలో మా నిబద్ధతను ధృడపరుస్తుంది. రాజకీయ అసమానతలను తొలగించడం, సామాజిక మరియు రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం, ప్రతి పౌరుని సమగ్ర అభివృద్ధికి భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం యొక్క స్థిరమైన నిబద్ధతను నొక్కి వక్కాణిస్తుంది.

40. పాలన అనేది ఖచ్చితమైన సమాచారంపై ఆధారపడి, సామాజిక వాస్తవికతలను అర్థం చేసుకున్నపుడు మాత్రమే ఏదేని సమాజం పురోగమిస్తుంది. ప్రతి సామాజిక వర్గానికి నిష్పాక్షిక ప్రాతినిధ్యం ఉండేలా చూడడానికి సర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో, కఠినమైన ధృవీకరణ ప్రక్రియల ద్వారా నిర్వహించడం జరిగింది.

41. సామాజిక న్యాయాన్ని అందించే దిశగా ఇటీవల నిర్వహించిన సర్వేలో కనుగొన్న ఫలితాల ఆధారంగా వెనుకబడిన తరగతుల (బిసిలు) కోసం 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక బిల్లును ప్రతిపాదించింది. బిసి కులాలకు విద్యా, ఉపాధి, పాలనలో న్యాయోచిత వాటాను నిర్ధారించడం ద్వారా చారిత్రాత్మకంగా తక్కువగావున్న ప్రాతినిధ్యాన్ని సరిదిద్దడానికి ఈ ప్రతిపాదన ఉద్దేశిస్తున్నది. న్యాయబద్ధ అవకాశాలు, సమ్మిళిత వృద్ధి కోసం ప్రభుత్వ నిబద్ధతకు ఈ కార్యక్రమం ఒక నిదర్శనంగా వుంటూ, పాలసీలు వాస్తవ డిమోగ్రాఫిక్ సమాచారం ఆధారంగా రూపొందించడానికి వీలు కల్పించింది.

42. అంతేకాక, జస్టిస్ షమీమ్ అక్తర్ కమీషన్ సిఫారసులు ఆధారంగా షెడ్యూల్డు కులాల (ఎస్‌సి) ఉప-వర్గీకరణ నిమిత్తం ఒక బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అత్యంత అణగారిన వర్గాలకు ప్రాధాన్యతను ఇస్తూ ఎస్‌సి కులాలకు రిజర్వేషన్ ప్రయోజనాలను మరింత న్యాయోచితంగా, సమతుల్యంగా అందించడమే ఈ ప్రతిపాదిత బిల్లు

ఉద్దేశ్యం. ఎస్‌సి రిజర్వేషన్లలో అంతర్గత అసమానతలను పరిష్కరించడం ద్వారా ప్రగతిశీలక పాలసీ రూపకల్పనలో తెలంగాణ నాయకత్వాన్ని, అత్యంత వెనుకబడిన వర్గాలను ఉద్ధరించడం ద్వారా తమ అంకిత భావాన్ని పునరుద్ఘాటిస్తున్నది.

43. న్యాయం, సామాజిక సమానత్వపు శాశ్వత ప్రాధాన్యతను గుర్తించి, ఫిబ్రవరి, 4వ తేదీన పైన పేర్కొన్న రెండు కార్యక్రమాలపై ఈ సభ చర్చించి, తీర్మానించి ఆ తేదీని ప్రభుత్వం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా కూడా ప్రకటించింది. ఈ వార్షిక పాటింపు అందరిని కలుపుకుపోవడానికి, న్యాయబద్ధతకు, సమాన అవకాశాలను అందించాలనే రాష్ట్ర ధృడ సంకల్పానికి ఒక నిదర్శనం. నేపథ్యంతో సంబంధం లేకుండా భవిష్యత్తులో ప్రతి పౌరుడు అభివృద్ధి, గౌరవం, సమృద్ధి పొందడానికి సమిష్టిగా పనిచేయాలనే మన కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది.

44. కల్లుగీత కార్మికులకు “కాటమయ్య రక్షణ కవచం”, చేనేత కార్మికుల కోసం “తెలంగాణ చేనేత అభయ హస్తం” వంటి ప్రత్యేక కార్యక్రమాలను పటిష్టపరచడం ద్వారా సాంప్రదాయ కార్మిక వర్గాలకు తగిన గుర్తింపు, భద్రత లభించేలా చేస్తుంది.

45. ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలకు గృహనిర్మాణం, విద్య, ఉపాధి, సామాజిక భద్రత కోసం ఆర్థిక సాయం అందించడంతోపాటు ముఖ్యమైన

పాలసీలను నా ప్రభుత్వం అమలు చేస్తున్నది. సమృద్ధిని పంచేలా, సమాన అవకాశాలు ఉండేలా, ప్రతి సామాజిక వర్గాన్ని పరిగణలోనికి తీసుకోవాలనేది భవిష్య తెలంగాణ విజన్‌గా వుంది.

## పరిశ్రమలు, సర్వీసు రంగాలు

46. వ్యాపార అనుకూల వాతావరణం, ప్రగతిశీల విధానాల ద్వారా తెలంగాణ పారిశ్రామిక వృద్ధి, సర్వీసు రంగ విస్తరణకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా రూపొందుతున్నది. మౌలిక సదుపాయాలను పటిష్టపరచడం, నియంత్రణ ప్రకియలను క్రమబద్ధీకరించడం, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి వుంది. అనుకూలమైన మద్దతు కల్పించడం, అధునాతన సాంకేతికతను అందుబాటులోనికి తీసుకురావడం, ఆర్థిక మద్దతును అందించడం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహ్ పరిశ్రమల (ఎంఎస్ఎంఇలు) పై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నది. వీటికి అదనంగా ఫార్మాసూటికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటి, పునరుత్పాదక ఇంధనం, ఆహార ప్రాసెసింగ్‌ల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా పటిష్టమైన రంగాల అభివృద్ధికి వీలు కలుగుతుంది.

47. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరమ్‌లో పాల్గొనడం ద్వారా అంతర్జాతీయ పెట్టుబడి దారుల నుండి గణనీయమైన పెట్టుబడులతో

మరింత ఉపాధి, ఆర్థిక సమృద్ధికి దారితీసి తెలంగాణ ఒక ప్రధాన పెట్టుబడి కేంద్రంగా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ డెలిగేషన్ 49,500 మందికి ఉద్యోగాలను కల్పించేలా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ప్రపంచ పెట్టబడిదారులతో డాటా సెంటర్లు, హరిత ఇంధనం, ఆహార ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్ వాహనాలు, రక్షణ తయారీ వంటి ప్రధాన రంగాలలో భారీ పెట్టుబడులను ఆకర్షించడం జరిగింది. తద్వారా మరోసారి తెలంగాణ తన స్ఫూర్తిని చాటుకుంది.

48. ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనలో ఎంఎస్ఎంఇల కీలక పాత్రను దృష్టిలో వుంచుకుని, చిన్న వ్యాపారాల కోసం ఒక పటిష్ట ఎకో సిస్టమ్‌ను పెంపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి వుంది. చిన్న వ్యాపారాల స్థిరమైన వృద్ధి నిమిత్తం అనుకూలమైన ఆర్థిక సహాయాన్ని, అధునాతన సాంకేతికతలను, మార్కెట్ అనుసంధానాలను కల్పించడమవుతున్నది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మద్దతు యివ్వడం, పోటీతత్వాన్ని పెంచడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానాన్ని సులభతరం చేయడం కోసం ఒక కొత్త ఎంఎస్ఎంఇ పాలసీని రూపొందించడమవుతున్నది.

49. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, క్రియాశీలక సిబ్బందితో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఆవిష్కరణలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా

కొనసాగుతున్నది. సమతుల్య ప్రాంతీయ వృద్ధికి దోహదపడుతూ, రాష్ట్రం ఐటి హబ్‌లను హైదరాబాద్ వెలుపలకు విస్తరిస్తున్నది. ప్రత్యేక ఐటి పార్కులను అభివృద్ధి చేసి, ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించి, ఎఐ, డేటా సెంటర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తన హోదాను సుస్థిరం చేసుకుంటున్నది.

50. జౌళి పరిశ్రమను పటిష్టపరిచేందుకు, మరమగ్గాల నేతకారుల అభ్యున్నతి కోసం నా ప్రభుత్వం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ వద్ద రూ.50 కోట్ల యార్న్ డిపోను ఏర్పాటు చేసింది. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా మహిళల ఆర్థిక స్వావలంబనను, ఆత్మ గౌరవాన్ని పెంపొందించడానికి స్వయం సహాయక గ్రూపులలో నమోదు చేసుకున్న 64.70 లక్షల మంది మహిళలకు ప్రతీ సంవత్సరం రెండు చీరలను ఇస్తున్నది.

## తెలంగాణ రాష్ట్ర పర్యాటక సామర్థ్యాన్ని ఆవిష్కరించడం

51. సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యమైన ల్యాండ్ స్కేప్‌లు, చారిత్రక ఆనవాళ్లతో తెలంగాణ ఒక అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా రూపొందడానికి పుష్కలమైన సామర్థ్యం కలిగివుంది. దీనిని గుర్తించి, మౌలిక సదుపాయాలను పెంపొందించి, శోధించని పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేసి, ఎకో-టూరిజం, హెరిటేజ్ టూరిజం,

అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి నా ప్రభుత్వం మొట్టమొదటి తెలంగాణ పర్యాటక అభివృద్ధి పాలసీని రూపొందించింది. దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి, ఈ రంగంలో నూతన ఆర్థిక స్వావలంబన, ఉపాధి కల్పనకు తోడ్పడటానికి ఈ పాలసీ ఒక నిర్మాణాత్మక ప్రణాళికను సమకూర్చుతుంది. ఈ కార్యక్రమం క్రింద పర్యాటకులకు మంచి అనుభూతి కలిగించడానికి చారిత్రక స్మారకాల పునరుద్ధరణ, పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచడం, డిజిటల్ ఇన్నోవేషన్స్ సహకారంపై నా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. టెంపుల్ టూరిజం, ట్రైబల్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించి ఆధ్యాత్మిక, చారిత్రక, సహజ అందాల విశిష్ట మేళవింపును పర్యాటకులకు అందిస్తుంది. ప్రయివేటు భాగస్వాములతో ఒప్పందం కుదుర్చుకొని, సామాజిక ఆధారిత పర్యాటక కార్యక్రమాలను ప్రోత్సహించి, పర్యాటకులకు, స్థానిక సామాజిక వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా తెలంగాణను ఒక ఉజ్వలమైన, స్థిరమైన పర్యాటక గమ్యస్థానంగా చేసేలా చూస్తాం.

## స్వచ్ఛ, హరిత ఇంధనం : తెలంగాణ భవిష్యత్తు విద్యుత్తు సామర్థ్యం

52. స్థిరమైన ఇంధనంలో అగ్రగామిగా ఉండేందుకు తెలంగాణ కట్టుబడి వుంది, తద్వారా హరితయుత, స్వయం సమృద్ధి గల భవిష్యత్తు ఉండేలా చూస్తుంది. నా ప్రభుత్వం ప్రకటించిన 2025 – స్వచ్ఛ, హరిత ఇంధన

పాలసీ ఇంధన భద్రతకు, స్థిరత్వానికి ప్రాధాన్యతను ఇస్తూ రాబోయే దశకంలో సౌర, పవన, ఇంధన నిల్వలను పెంచడం కోసం ఒక ప్రణాళికను రూపొందించింది. పుష్కలమైన సౌర, పవన ఇంధన సామర్థ్యంతో తెలంగాణ, భవిష్య ఇంధన డిమాండ్లను తీర్చడానికి పునరుత్పాదక రంగం, పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్, గ్రీన్ హైడ్రోజన్ రంగాలలో వ్యూహాత్మక పెట్టుబడులు పెడుతున్నది. నిర్దిష్ట గమనశీలతకు తోడ్పాటుగా 2029-30 నాటికి 6000 ఇవి ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పాటుపడుతున్నది. ఈ పాలసీ ఇంధన భద్రతను మెరుగుపరిచి, పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగాలను కల్పించడం వల్ల స్వచ్ఛ ఇంధనం, వాతావరణ అనుకూలతలలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలుపుతుంది.

## భూపరిపాలనను బలోపేతం చేయడం

53. భూ పరిపాలనను క్రమబద్ధీకరించడానికి, పౌరులందరికీ భూ భద్రతను కల్పించడానికి మా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టింది. భూ వివాదాలను తగ్గించడానికి, భూ రికార్డులలో పారదర్శకతను పెంపొందించడానికి, న్యాయబద్ధమైన యాజమాన్యానికి రక్షణ కల్పించడానికి ఈ పరివర్తన చట్టాన్ని రూపొందించడమయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, డిజిటల్ మ్యాపింగ్‌ను ఉపయోగించడం ద్వారా, ఈ చట్టం భూమి హక్కులను పొందడానికి,

ఇబ్బంది లేని లావాదేవీలకు వీలుకల్పిస్తూ పటిష్టమైన లీగల్ ఫ్రేమ్-వర్క్‌ను అందిస్తుంది. భూసంస్కరణలతో పాటు గ్రామ రెవెన్యూ వ్యవస్థను పూర్వ స్థితికి తెచ్చేందుకు, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల పాత్రను పునరుద్ధరించేందుకు నా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ చర్య గ్రామీణ పాలనను బలోపేతం చేయడం, భూ సంబంధిత సేవలను సరళతరం చేయడం, భూ సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చేయడం ద్వారా బాధ్యతాయుతమైన, సమ్మిళిత మరియు పౌర కేంద్రీకృత పాలన పట్ల తెలంగాణ నిబద్ధతను దృఢపరుస్తుంది.

54. తెలంగాణ పోలీసు శాఖ ప్రజా భద్రత, నేర నివారణ, ఆధునీకీకరణకు కట్టుబడి వుంది. ఈ దృక్పథంలో భాగంగా, విద్యాపరమైన, వృత్తిపరమైన పెరుగుదలకు తోడ్పడేందుకు పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ప్రపంచ స్థాయి విద్యా సంస్థ అయిన “యంగ్ ఇండియా పోలీసు స్కూల్”కు గౌరవ ముఖ్యమంత్రి గారు శంఖుస్థాపన చేయడం జరిగింది.

55. సమర్ధవంతమైన విపత్తు ప్రతిస్పందన యంత్రాంగ అవసరాన్ని గుర్తించి, నా ప్రభుత్వం తెలంగాణ అగ్నిమాపక శాఖ నుండి 1000 మంది సిబ్బందిని, తెలంగాణ ప్రత్యేక పోలీసు బెటాలియన్ల నుండి 1000 మంది సిబ్బందిని నియోగిస్తూ తెలంగాణ విపత్తు ప్రతిస్పందన దళం

(ఎస్‌డిఆర్ఎఫ్) ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక దళం ప్రకృతి విపత్తుల నుండి, మానవ తప్పిదాల వల్ల ఏర్పడే విపత్తుల నుండి ప్రజల ప్రాణాలను, ఆస్తులను పరిరక్షించడానికి సత్వరంగా, సమర్ధవంతంగా స్పందిస్తుంది.

56. క్రియాశీలక విపత్తు నిర్వహణ నిమిత్తం ఒక ముఖ్యమైన చర్యగా విపత్తు ముప్పు తగ్గింపు కోసం సెండమ్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు పరచడానికి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) తో రాష్ట్ర ప్రభుత్వం ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సంసిద్ధత, నివారణ, మెరుగైన స్థితిస్థాపక ఏర్పాటు చర్యల ద్వారా విపత్తు ముప్పును తగ్గించి తెలంగాణలోని ప్రజలను రక్షించడానికి ఈ కార్యక్రమం ప్రాధాన్యతనిస్తున్నది.

## తెలంగాణ భవిష్యత్తు కోసం విజన్

57. సమ్మిళిత వృద్ధి, సాంకేతిక నాయకత్వం, స్థిరమైన అభివృద్ధి విజన్ ద్వారా తెలంగాణ మార్పుకు చేరువలో వుంది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, మౌలిక సదుపాయాలను పటిష్టపరచడానికి, ప్రతీ పౌరుని సాధికారతకు నా ప్రభుత్వం కట్టుబడి వుంది. మెట్రో రైలు నెట్‌వర్క్‌ల విస్తరణ, ప్రతిష్ఠాత్మక మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయడం ద్వారా పట్టణ జీవితాన్ని, ఆర్థిక

సామర్థ్యాన్ని పునర్ నిర్వచించడానికి సిద్ధంగా ఉంది. భారతదేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఆవిర్భవించాలని ఆకాంక్షించే సుస్థిరమైన ప్రపంచ శ్రేణి నగరంగా ప్రణాళిక బద్ధమైన అభివృద్ధిని క్రియాశీలకంగా ప్రోత్సహించడానికి ఒక ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని నా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నది. 7 మండలాలు, 56 గ్రామాలలోని 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ తెలంగాణ పట్టణ, పారిశ్రామిక అభివృద్ధిలో ఒక పరివర్తనాత్మక చర్యగా ఉంది. వ్యూహాత్మకంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు, స్మార్ట్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి, సమ్మిళిత నైవాసిక ప్రణాళికను సమీకృతం చేస్తుంది. మల్టీ మోడల్ మొబిలిటీ, మెట్రో అందుబాటుతో పాటు ఎఐ సిటీ, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల సహకారంతో ఆర్థిక కార్యకలాపాలను పెంచడానికి, ఉపాధి అవకాశాలను కల్పించడానికి, జీవన నాణ్యతను పెంపొందించడానికి ఫ్యూచర్ సిటీ రూపొందించబడింది. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ కార్యక్రమాన్ని అడ్డంకులు లేకుండా అమలు చేసి, భారతదేశంలో భావి తరం పట్టణాభివృద్ధికి ఒక నమూనాగా రూపొందిస్తుంది.

58. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించి, పునరుత్పాదక ఇంధనం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, హై-టెక్ పరిశ్రమలలో తెలంగాణను

అగ్రగామిగా చేయడం ద్వారా నా ప్రభుత్వం సుస్థిరతతో పాటుగా పురోగతిని సమతుల్యం చేసి భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తున్నది. ఎఐ సిటి, మెరుగైన డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి వ్యూహాత్మక కార్యకమాలతో పాటూ పరిశుభ్రమైన, హరిత ఇంధనం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత వల్ల తెలంగాణ ఆధునికతకు, అవకాశాలకు ఒక దిక్సూచిగా ఆవిర్భవిస్తుంది. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, సమ్మిళిత పాలన పట్ల మనకున్న అచంచల అంకిత భావమే అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు మూలస్థంభంగా వుండి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, దేశానికి ఒక ఆదర్శ రాష్ట్రంగా ఉండే దిశగా ముందుకు వెళుతున్నాం.

59. తెలంగాణ ఒక అసాధారణ పరివర్తనకు చేరువలో వుంది. బడ్జెటు అనేది కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదు, అది ఒక పటిష్టవంతమైన, మరింత సుస్థిరమైన తెలంగాణను రూపొందించడానికి సంబంధించింది. ఇది పురోగతికి రోడ్ మ్యాప్‌గా, న్యాయానికి కట్టుబడివుండి, ప్రతి పౌరుని ఆకాంక్షలను నెరవేర్చే ఒక వాగ్దానంగా వుంది.

60. బడ్జెట్ కేవలం అంకెల కూర్పు మాత్రమే కాదు, భవిష్యత్తు కోసం ప్రభుత్వ ప్రాధాన్యతలు, విజన్‌కు ప్రతిబింబం. మన పాలసీలను, కార్యక్రమాలను, సంక్షేమ చర్యలను తెలియజేసే ఒక ఆర్థికపరమైన నమూనా. అందువల్ల, శాసనమండలి సభ్యులు అత్యంత ఆసక్తితో, శ్రద్ధతో బడ్జెట్ చర్చలో తప్పనిసరిగా పాల్గొనాలి. “నేటి రోజున జరిగిన బడ్జెట్ చర్చలు రేపటి

ఆర్థిక ఇబ్బందులను నివారిస్తుంది". కొన్నిసార్లు అంకెలు భయపెట్టినప్పటికీ, ప్రతి కేటాయింపు వెనుక మన ప్రజల ఆకాంక్షలు వున్నాయని మనం గుర్తించాలి. అందువల్ల, బడ్జెట్ సమావేశాలలో శ్రద్ధ, స్పష్టతతో పాల్గొనాలి.

61. యువ, డైనమిక్ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిగారి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వ సంకల్పం దృఢమైనది. ప్రవేశపెట్టిన ప్రతి పాలసీ, ప్రతి కార్యక్రమం, ప్రతి సంస్కరణ అవకాశాల కల్పనకు, ప్రజల సాధికారతకు, సమ్మిళిత వృద్ధి కోసం ఉద్దేశించినది. విజన్ స్పష్టంగా ఉంది, దిశా నిర్దేశాన్ని నిర్ణయించడం జరిగింది, వేగగతి నిలువరించలేనిది.

62. నేటి తెలంగాణ అవకాశాలు, అభివృద్ధి, సాధికారతగల రాష్ట్రంగా ఉంది. రేపటి తెలంగాణ మరింత ఉజ్వలమైనది – ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ పరిపుష్టి, సాంకేతిక విజ్ఞాన వినూత్నత, సామాజిక న్యాయం, మానవ ప్రాభవానికి అగ్రగామి రాష్ట్రం కాబోతుంది.

63. డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ గారు అన్నట్లు "కలలు కనండి, కలలు కనండి, కలలు కనండి. కలలు ఆలోచనలుగా మారుతాయి, ఆ ఆలోచనలు కార్యాచరణ రూపం దాలుస్తాయి". తన ప్రజల కలలను ఈ ప్రభుత్వం విశ్వసిస్తుంది, విజన్, సంకల్పం, కార్యాచరణ ద్వారా ఆ కలలను వాస్తవాలుగా మేము మారుస్తున్నాం.

సమృద్ధి, సమానత్వం, పురోగతిలో దేశానికి దిక్సూచి అయ్యే తెలంగాణ నిర్మాణానికి సంఘటితంగా, విశ్వాసంతో, స్థిరమైన నిబద్ధతతో మనమందరం కలిసి ముందుకు సాగుదాం.

**జై హింద్ !**

**జై తెలంగాణ !**